మల్లన్న ఆలయాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే విజయరమణారావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, జనవరి 17: మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని లాలపల్లి పంచవటి వృక్ష ప్రాంగణంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు ఎమ్మెల్యే విజయరమణారావు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇక్కడ 5 రకాల మొక్కలను నాటి వాటిని వృక్షాలుగా ఎదిగేలా చేసి పంచవటి ప్రాంగణంగా తీర్చిదిద్దిన పెద్దలు, గ్రామస్తులను అభినందించారు. ఈ ప్రాంగణాన్ని మరింత అభివృద్ధి చేసి దీనిని పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో వేసిన మల్లన్న పట్నాలను ఎమ్మెల్యే వీక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సింగిరెడ్డి ఎల్లవ్వ-రాజేశ్వరరెడ్డి, బూర్ల సింధూజ, అర్శనపెల్లి వెంకటేశ్వరరావు, గొల్లె కావేరి-భూమేశ్, దుగ్యాల శ్వేత-సంతోష్‌రావు, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

పొలంలో దిగి.. నాటేసి

నిత్యం సమీక్షలు, సమావేశాలు, అభివృద్ధి పనులతో బిజీగా ఉండే పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ బుధవారం రైతు అవతారం ఎత్తారు. పెద్దపల్లి పట్టణ శివారు చందనపల్లిలో రైతుల పొలాలను సందర్శించారు. నాటేస్తున్న మహిళలను చూసి తాను కూడా నాటేసేందుకు పొలంలోకి దిగారు. కాసేపు నాటేసి, సాగులో ఎదురవుతున్న కష్టాలను వారిని అడిగి తెలుసుకున్నారు. - పెద్దపల్లి టౌన్, జనవరి 17

సింగరేణి సీఎండీని కలిసిన నాయకులు

గోదావరిఖని, జనవరి 17: సింగరేణి సీఎండీ బలరాంను ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శులు అప్సర్ ఖాన్, జాహిద్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి సన్మానం చేశారు. ఇక్కడ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిల్ షరీఫ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జియా అహ్మద్, ప్రధాన కార్యదర్శి గౌస్ పాషా, మొయినొద్దీన్, ఫిరోజ్, సంపత్ ఉన్నారు.

డబ్బుల వసూలుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మంథని, జనవరి 17: స్థానిక మాతాశిశు దవాఖానలో మత్తు డాక్టర్ మోహన్‌రావు తన వద్ద డబ్బులు వసూలు చేసినట్లు కలెక్టర్, డీసీహెచ్‌లకు ఫిర్యాదు చేసినట్లు మంథనికి చెందిన బండారి సమ్మయ్య బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తన భార్యను ప్రసవం కోసం మాతా శిశు దవాఖానకు తీసుకురాగా ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లిన తర్వాత మత్తు డాక్టర్ డబ్బులు డిమాండ్ చేశాడని తెలిపారు. ఫోన్ పే ద్వారా డబ్బులు చెల్లిస్తానని చెప్పినా వినకుండా నగదు డబ్బులు ఇచ్చే వరకు మత్తు ఇంజక్షన్ చేయలేదన్నారు. చాలా మందిని డబ్బులు ఇదే విధంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని సమ్మయ్య వివరించారు. సదరు డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

రిటైర్డ్ కార్మికులకు ఏరియర్స్ చెల్లింపు

గోదావరిఖని, జనవరి 17: సింగరేణిలో పని చేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన కార్మికులకు 32 శాతం లాభాల వాటా, దీపావళి బోనస్, 11వ వేతన ఒప్పందంకు సంబంధించిన బకాయిలను చెల్లించేందుకు సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది. దీనికి సంబంధించిన మూడు సర్క్యులర్లను బుధవారం జారీ చేసింది. రిటైర్డు కార్మికులకు రావల్సిన ఏరియర్స్ బకాయిలు 32 శాతం లాభాల వాటా ఈ నెల 19న దీపావళి సందర్భంగా చెల్లించే లాభాల బోనస్‌ను ఈ నెల 21న చెల్లించేందుకు, బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందానికి సంబంధించి బకాయిలు ఏరియర్స్‌ను వచ్చే నెల ఫిబ్రవరి 6న చెల్లించేందుకు నిర్ణయించారు. కొంత కాలంగా రిటైర్డు కార్మికులకు బకాయిలు చెల్లించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. 1 ఏప్రిల్ 2022 నుంచి 31 అక్టోబర్ 2023 వరకు రిటైర్డు కార్మికులకు దీపావళి బోనస్‌ను ఈ నెల 21న చెల్లించనున్నారు. 1 ఏప్రిల్ 2023 నుంచి 30 సెప్టెంబర్ 2023 మధ్య రిటైర్డు కార్మికులకు ఈ నెల 19న 32 శాతం వాటా చెల్లించనున్నారు. సింగరేణిలో పని చేస్తున్న కార్మికులకు ఇప్పటికే బకాయిలను చెల్లించారు. పెండింగ్‌లో ఉన్న రిటైర్డు కార్మికులకు సైతం చెల్లింపులు చేసేందుకు నిర్ణయించడంతో అందరికీ చెల్లింపులు చేసినట్లు అవుతున్నది.

రైస్ మిల్లుపై అధికారుల చర్యలు

సుల్తానాబాద్ రూరల్, జనవరి 17: సుద్దాల శివారులోని ఓ రైస్ మిల్లుపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ విషయంపై రామగుండం పొల్యూషన్ కంట్రో ల్ బోర్డు ఈఈ భిక్షపతిని వివరణ కోరగా రైస్ మిల్లు నుంచి వెలువడుతున్న విషపూరిత వ్యర్థాలు తమ పొలాల్లోకి వస్తున్నాయని పలుమార్లు సదరు రైస్ మిల్లు యాజమాన్యం దృష్టికి రైతులు తీసుకెళ్లారు. వారు పట్టించుకోకపోవడంతో రైతులు నెల క్రితం రామగుండం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో పాటు హైదరాబాద్ క్షత్రియ కార్యాలయ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు రైతులు చేశారు. అధికారులు రైస్ మిల్లు పరిసర ప్రాంతాలను పరిశీలించిన అనంతరం విద్యుత్ శాఖకు సిఫార్సు చేసి కరెంట్ సరఫరా నిలిపి వేయించారు. ఈ విషయమై మిల్లు యాజమాన్యాన్ని వివరణ కోరగా పొల్యూషన్‌కు సంబంధించి అధికారులు సూచించిన అన్ని అంశాలను పూర్తి చేశామనారు. పండుగ సెలవులు రావడంతో అధికారులు రాలేదని, రామగుండం నుంచి అధికారులు వచ్చి పరిశీలించిన అనంతరం తిరిగి కరెంట్ సరఫరా పునరుద్ధరిస్తారని తెలిపారు.

పాత కక్షలతో దాడికి పాల్పడ్డారని ఫిర్యాదు

ముత్తారం, జనవరి 17: పాత కక్షలతో తమపై కొందరు మంగళవారం దాడికి పాల్పడ్డారని, వారి నుంచి తమకు ప్రాణ భయం ఉందని లక్కారం గ్రామానికి చెందిన దోరి మంజులాశ్రీనివాస్ ఠాణాలో ఎస్ఐ మధుసూదన్‌రావుకు ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన వీరగోని శ్రీనాథ్, వీరగోని రాజేశం, విజయ్, శేఖర్, శివ, భాగ్యమ్మ, గొట్టిముక్కుల సౌజన్య, రాజమణిపై చర్యలు తీసుకోవాలన్నారు.

కొనుగోళ్లు సరే.. చెల్లింపులేవి..?

- నెల రోజులైనా ఖాతాల్లో జమకాని ధాన్యం డబ్బులు
- మంథని పీఏసీఎస్ పరిధిలో అన్నదాతల ఇబ్బందులు
- రూ.24కోట్ల కోసం 1579 మంది ఎదురుచూపులు
- నిత్యం కేంద్రాల చుట్టూ చక్కర్లు

మంథని, జనవరి 17: కర్షకులు కలవరపడుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు సర్కారు డబ్బుల చెల్లింపుల వ్యవహారాన్ని చూసి ఆందోళన చెందుతున్నారు. మంథని పీఏసీఎస్ పరిధిలో ధాన్యం విక్రయించి నెల రోజులైనా ఖాతాల్లో జమకాక పోవడంతో కేంద్రాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఇప్పటివరకు 1579 మంది రైతులకు రూ.24కోట్ల పేమెంట్ రావాల్సి ఉండగా, వెంటనే జమ చేయాలని కోరుతున్నారు.

రూ.24కోట్ల బకాయిలు..

కేసీఆర్ సర్కారు తీసుకున్న చర్యలతో వ్యవసాయం పండుగలా మారింది. పదేండ్లుగా ఏ యేటికాయేడు సాగు విస్తీర్ణం పెరిగిపోతున్నది. ఈ క్రమంలో గత వానాకాలం రైతన్న ఇంట సిరుల పంట పండింది. ఈ క్రమంలో ప్రభుత్వం ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, బీ-గ్రేడ్(సాధారణ) రకానికి రూ.2,183 మద్దతు ధరగా నిర్ణయించిన విషయం తెలిసిందే. మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో అధికారులు 33 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. దాదాపు 3వేల మంది రైతుల నుంచి సుమారు 2,28,496 క్వింటాళ్ల మేర ధాన్యాన్ని సేకరించారు. ఈ నెల 10వ తేదీలోపు మంథని పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని సెంటర్లలో సేకరణ ప్రక్రియను పూర్తి చేశారు. అయితే సేకరించిన ధాన్యానికి గాను రైతులకు రూ.44,97,68,792 నగదు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 1,184 మంది రైతులకు రూ.2,08,86,302 నగదును మాత్రమే చెల్లించారు. ఇంకా 1,579 మంది రైతులకు రూ.24,09,05,765 చెల్లించాల్సి ఉంది. అయితే ధాన్యం విక్రయించి నెల రోజులు గడుస్తున్నా డబ్బులు మాత్రం జమకాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫెర్టిలైజర్స్ షాపుల్లో ఖాతాలు కట్టలేక పోతున్నామని, మళ్లీ యాసంగి పెట్టుబడులకు అప్పులు చేయాల్సిన పరిస్థితులు దాపురించాయని వాపోతున్నారు.

రెండు, మూడు రోజుల్లో జమ చేయిస్తాం

మంథని పీఏసీఎస్ పరిధిలో ధాన్యం విక్రయించినవారిలో ఇప్పటికే దాదాపు 1,184 మంది రైతులకు రూ.2,08,86,302 నగదును జమచేశాం. మిగతా రైతులందరికీ రెండు లేదా మూడు రోజుల్లో నగదు జమయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నాం.
- కొత్త శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్, మంథని.

45 రోజులైనా డబ్బులు పడలే..

మాది చిన్న ఓదాల. ఊళ్లే పెట్టిన కేంద్రంలో నేను 252 బస్తాల ధాన్యం అమ్మి 45 రోజులైతంది. ఇప్పటికి రూపాయి కూడా ఖాతాలో పడలే. ఏమైందని సెంటర్ నిర్వాహకులను అడిగితే ట్యాబ్‌లో ఎంట్రీ చేసినమని, డీఎం కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని అంటున్నరు. ఇట్లయితే కష్టమే. తెచ్చిన దగ్గర ఎట్ల కట్టాలె. ట్రాక్టర్ ఈఎంఐ కట్టేది ఉంది..? ఏం చేయాలో అర్థమైత లేదు. వెంటనే డబ్బులు వేయాలి.
- ఎల్. సురేష్, రైతు, చిన్న ఓదాల, మంథని

క్రీడలతో మానసికోల్లాసం

ట్రోఫీ అందజేస్తున్న శ్రీను బాబు

మంథని, జనవరి 17: క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహపడుతాయని కాంగ్రెస్ నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. సంక్రాంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించిన శ్రీపాద కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన వారికి దుద్దిళ్ల శ్రీను బాబు బుధవారం బహుమతులను ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన వెంకీ ఎలెవన్స్‌కు రూ. లక్ష, రెండో బహుమతి చక్‌దే జట్టుకు రూ. 50వేలు, షీల్డులను అందజేశారు. కార్యక్రమం లో నాయకులు శశిభూషణ్, శ్రీనివాస్, వొడ్నాల శ్రీనివాస్, రమాదేవి, మంథని లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నేతలతో ఆర్డీవో సమావేశం

మంథని, జనవరి 17: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో హనుమానాయక్ నియోజకవర్గంలోని 9 మండలాల తహసీల్దార్లతో పాటు అన్ని పార్టీల నాయకులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

'సహకార క్రాంతి'ని ఉపయోగించుకోవాలి

మంథని, జనవరి 17: కేడీసీసీ బ్యాంక్ ప్రవేశ పెట్టిన సహకార క్రాంతి డిపాజిట్ పథకాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని కేడీసీసీ బ్యాంక్ జీఎం ఉషశ్రీ కోరారు. బుధవారం కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ దుమ్మని లక్ష్మణ్, డీఈ దిలీప్, బ్యాంక్ సిబ్బందితో కలిసి పట్టణంలో ఇంటింటికీ తిరుగుతూ డిపాజిట్లను సేకరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. అఖిల భారత స్థాయిలో గత దశాబ్దాపు అత్యుత్తమ సహకార బ్యాంక్‌గా గుర్తింపు పొంది ఏడేళ్లుగా అవార్డులను అందుకుందన్నారు. వంద సంవత్సరాలకు పైగా సేవలందిస్తూ వినియోగదారుల మన్ననలు పొం దుతున్నదని చెప్పారు. సహకార క్రాంతి డిపాజిట్లపై 546 రోజులకు 7.50 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.0 శాతం వడ్డీ వస్తుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధర్మారం,జనవరి17: ధర్మారంలోని మోడల్ స్కూల్‌లో (6వ తరగతిలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మన్నె దీనబుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. పాఠశాలలో 7 నుంచి 10 తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఈ నెల 22 తేదీతో గడువు ముగియనుందని వివరించారు. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గురుకులంలో..

మల్లాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయంలో 2024-25కు గాను ఐదో తరగతిలో ప్రవేశాలకు విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ గిరిజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. ఈ నెల 20తో దరఖాస్తు గడువు ముగియనుందని పేర్కొన్నారు. వచ్చే నెల 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. వివరాలకు సెల్ 86880 17290 లో సంప్రదించాలని ఆమె సూచించారు.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ

ధర్మారం,జనవరి17: గోపాల్‌రావుపేట శివారులో పెద్దపల్లి-ధర్మారం ప్రధాన రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వేముర్ల రాజయ్య (50)కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ టీ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోపాల్‌రావుపేటకు చెందిన రాజయ్య మండల కేంద్రానికి స్కూటీపై వస్తున్నాడు. నంది మేడారం వద్ద పెద్దపల్లి-ధర్మారం రోడ్డు మీదకు వస్తున్న సమయంలో కారు ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో రాజయ్య కాలు విరిగింది. తలకు తీవ్రగాయమైంది. అదే సమయంలో ధర్మారం వెళ్తున్న ఎస్ఐ సత్యనారాయణ తన వాహనాన్ని ఆపాడు. బాధితుడిని చికిత్స కోసం అంబులెన్స్ తెప్పించి కరీంనగర్‌కు పంపించి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. ప్రమాదానికి కారకుడు జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రానికి చెందిన ఆవుల శ్రీనివాస్‌గా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు.

'మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడం సరికాదు'

గోదావరిఖని, జనవరి 17: గుంటూరు కారం సినిమాలో విలన్లకు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఇప్టా నాయకులు కే స్వామి, లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ మహనీయుల పేర్లు వెంటనే తీసివేయాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్‌కు బానిసలైన నిర్మాతలు చిత్రాలు నిర్మించడం, అజ్ఞానంతో మాటలు రాయడం, దుష్పరిమాణాలకు దారి తీస్తున్నదని ఆరోపించారు.

'మిషన్ భగీరథ నీరు ఎప్పుడిస్తరు'

జ్యోతినగర్, జనవరి 17: ఎన్టీపీసీ పట్టణం మూడో డివిజన్ అన్నపూర్ణకాలనీ అంబేద్కర్ భవన్ లైన్‌లో మిషన్ భగీరథ నీరు ఎప్పుడు ఇస్తారని సీపీఎం ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి రామాచారి బుధవారం ఒక ప్రకటనలో అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికే కాలనీలో మిషన్ భగీరథ నీటి సరఫరా ఆలస్యంగా జరిగిందన్నారు. వారం రోజుల క్రితం నీటి సరఫరా పైప్‌లైన్‌కు మట్టితీసి పైపులైన్ వేయకుండా వదిలేశారన్నారు. దీంతో ఇండ్ల ముందున్న మట్టి కుప్పలతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. డ్రైనేజీ నీరు వాటర్ పైపులైన్ కాలువలో చేరుతోందన్నారు.

బాలికా సాధికారత వర్క్‌షాప్ ప్రారంభం

విద్యార్థినితో కేక్‌కట్ చేయిస్తున్న ఏజీఎం హెచ్ఆర్

జ్యోతినగర్, జనవరి 17: బాలికా సాధికారత కోసం రామగుండం ఎన్టీపీసీ యాజమాన్యం బుధవారం ఎన్టీపీసీ ఈడీసీ హాల్‌లో గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ వర్క్‌షాప్‌ను ప్రారంభించింది. ఎన్టీపీసీ ఏజీఎం హెచ్ఆర్ బిజోయ్‌కుమార్ సిక్దర్ హాజరయ్యారు. ఐదు రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్‌తో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎన్టీపీసీ ప్రభావిత ఏరియాలోని ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతికి చెందిన 54మంది విద్యార్థినులకు స్కిల్డ్ డెవలప్‌మెంట్, ఆర్ట్, క్రాఫ్ట్, రిఫ్రెషర్ కోర్సు, నృత్య తరగతులు జరుగనున్నాయి. ఇక్కడ హెచ్ఆర్ డీజీఎం శామ్యూల్ ప్రశాంత్, అధికారి వేముగంటి యుగేంధర్‌రావు ఉన్నారు.

క్యాలెండర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు, ఉద్యోగులు

టీఎన్జీవోస్ క్యాలెండర్ విడుదల

పెద్దపల్లి, జనవరి17: టీఎన్జీవో సంఘం రూపొందించిన న్యూ ఇయర్ క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్‌ను కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, జిల్లా కార్యదర్శి మేనేని సందీప్ రావు, సహ అధ్యక్షుడు నూగూరి సుధీర్,ఉపాధ్యక్షుడు కొమురయ్య, పబ్లిసిటీ సెక్రటరీ మహేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అయిరెడ్డి సందీప్ రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్, రూరల్ అధ్యక్షుడు ఆకుల సురేశ్, కార్యదర్శి అంజి, సుల్తానాబాద్ అధ్యక్షుడు పిస్క సత్యనారాయణ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అనిత, రాజేందర్, రాజారత్నం, ప్రేమ్, శ్రీనివాస్, స్వప్న, సంజీవ రాణి, మణెమ్మ, ఫర్జానా, రాజా రత్నం, అరుణ, సరిత, శివ, సురేశ్, రఫీ, అమృత్ పాల్గొన్నారు.

కూలిన వంతెనను పునర్నిర్మించాలి

కోల్‌సిటీ, జనవరి 17: రామగుండం నగర పాలక సంస్థ 9వ డివిజన్ జనగామలో గోదావరి వరదల వల్ల కూలిపోయిన వంతెనను వెంటనే పునర్‌నిర్మించాలని సీపీఐ నగర కార్యదర్శి కే కనకరాజ్ సింగరేణి యాజమాన్యం, నగర పాలక సంస్థను కోరారు. జనగామలోని కూలిన వంతెనను బుధవారం పరిశీలించి అక్కడే నిరసన చేపట్టారు. గతంలో భారీ వర్షాల వల్ల వరదల ఉధృతికి వంతెన కూలిపోయిందని, సింగరేణి, కార్పొరేషన్ అధికారులు సందర్శించి వంతెన పునర్నిర్మాణం చేపడుతామని చెప్పి ఏడాది గడిచినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. వంతెన నిర్మాణం కోసం మంజూరైన నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ జోక్యం చేసుకొని సింగరేణి, బల్దియా అధికారులతో చర్చించి వెంటనే పునర్నిర్మాణం జరిగేలా చూడాలని కోరారు. నాయకులు రమేశ్‌కుమార్, తాళ్లపల్లి మల్లయ్య, గుంపుల కుమారస్వామి, జైపాల్ రెడ్డి, జగన్ పాల్గొన్నారు.

పరామర్శ

ఓదెల, జనవరి 17: ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తల్లి ఇటీవల మృతి చెందగా, ఆ కుటుంబాన్ని బుధవారం ఓదెల మండల తెలంగాణ ఉద్యమకారులు పరామర్శించారు. శంకర్‌రెడ్డి తల్లి చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులు అర్పించారు. ఇక్కడ తెలంగాణ ఉద్యమ నాయకులు గుండేటి ఐలయ్యయాదవ్, తుంగాని శ్రీనివాస్, ముద్దమల్ల రమేష్, కాంతాల సమ్మిరెడ్డి, పాకాల సంపత్‌రెడ్డి, జంగం కొమురయ్య, గట్టు సమ్మయ్య తదితరులు ఉన్నారు.

సమస్యలు సామరస్యంగా పరిష్కరించాలి

గోదావరిఖని, జనవరి 17: సింగరేణి కార్మికుల సమస్యలు సామరస్యంగా పరిష్కారమయ్యేలా యాజమాన్యం సహకరించాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోచం పేర్కొన్నారు. బుధవారం ఆర్జీ-1 జీడీకే-1 సీఎస్పీలో ఏఐటీయూసీ సభ్యుల పరిచయ కార్యక్రమం అనంతరం మాట్లాడారు. పరస్పర సహకారంతో యాజమాన్యం, గుర్తింపు సంఘం పాటు పడితేనే కంపెనీ మనుగడ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి శ్రీనివాస్, బండి మల్లేశ్, సమ్మయ్య, జానీ మియా, లక్ష్మయ్య, నర్సయ్య, ఓదెలు, సారంగపాణి, రాజిరెడ్డి, తోట శ్రీనివాస్, పోశాలు, స్వామి, సమ్మయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌ను పరిశీలించిన అధికారులు

చెక్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు

పెద్దపల్లి రూరల్, జనవరి 17 : భోజన్నపేట, మూలసాల గ్రామాల మధ్య హుస్సేన్‌మియా వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్ పేల్చివేతకు గుర్తు తెలియని దుండగులు యత్నించిన విషయం తెలిసిందే. ఈ చెక్ డ్యామ్‌ను ఎస్ఐ మల్లేశ్ తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. బ్లాస్టింగ్ కోసం వేసిన రంధ్రాలను చూశారు. చెక్ డ్యామ్‌ను పేల్చేందుకు జరిగిన కుట్రపై విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కోరారు. మంగళవారం రాత్రి బీఆర్ఎస్ నాయకుడు బాలసాని ఈశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో రైతులు, నాయకులు చెక్ డ్యామ్‌ను పరిశీలించారు. మరుసటి రోజు బీఎస్పీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష నాయకులు చూశారు. దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలలని నాయకులు కోరారు. ఇక్కడ నాయకులు బొంకూరిసురేందర్ సన్నీ, బొంకూరి దర్గయ్య, సాతూరి అనిల్, మల్లారపు రవీందర్ పాల్గొన్నారు.

నీరుకుళ్లలో వేలం

సుల్తానాబాద్‌రూరల్, జనవరి 17: నీరుకుళ్ల మానేటి రంగనాయక స్వామి ఆలయ ఆవరణలో నీరుకుళ్ల-వేగురుపల్లి గ్రామాల ఆధ్వర్యంలో జరిగే సమక్క-సారలమ్మ జాతర లో దుకాణాల ఏర్పాటుకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించినట్లు ఎండోమెంట్ ఈవో శంకరయ్య తెలిపారు. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరిగే సమక్క-సారలమ్మ జాతరలో కొబ్బరికాయలు, బంగార(బెల్లం) విక్రయాలకు రూ.1.67లక్షలకు ఎనగంటి రమేశ్, లడ్డూ పులిహోర విక్రయాలకు రూ.1.19లక్షలకు పృథ్వీ, తలనీలాలకు రూ.72 వేలకు వేలం దక్కించు కున్నారని పేర్కొన్నారు. కోళ్లు విక్రయాలకు సంబంధించి వేలం వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

భూమి కేటాయింపుపై విచారణ జరిపించాలి

ధర్మారం,జనవరి17: దొంగతుర్తి శివారులోని ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన వేమునూరి లింగయ్యకు కేటాయిస్తూ సర్పంచ్ పాలకుర్తి సత్తయ్య నిర్ణయించడంపై ఎంపీటీసీ దాడి సదయ్య జిల్లా కలెక్టర్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు వివరాలను ఆయన వెల్లడించారు. గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి లింగయ్య తన సొంత పట్టా భూమి 2 గుంటలు ఇచ్చాడని పేర్కొన్నారు. అయితే సర్పంచ్ సత్తయ్య పంచాయతీ పాలక వర్గానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా గుడికి ఇచ్చిన భూమికి బదులుగా గ్రామ శివారులోని సర్వే నంబర్ 380లోని నర్సరీ, పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డుకు సంబంధించిన ప్రభుత్వ భూమిని లింగయ్యకు కేటాయిస్తూ సర్పంచ్ తన సొంత లెటర్ ప్యాడ్‌పై రాసి ఇచాచరని ఆరోపించారు. సర్పంచ్ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపించి నర్సరీ భూమిని అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బెస్ట్ యోగా మాస్టర్ ఎంపిక

రామగిరి జనవరి 17 : ఆర్జీ - 3 డివిజన్ ఓసీపీ -1లో ఫోర్‌మన్ బోడ జబ్బార్ లాల్‌ను బహుజన సాహిత్య అకాడమీ సంస్థ హైదారాబాద్ బెస్ట్ యోగా మాస్టర్‌గా జాతీయ అవార్డుకు ఎంపిక చేస్తూ బుధవారం ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఉత్తర్వులు అందజేశారు. తిరుపతిలో ఫిబ్రవరి -11న నిర్వహించే బహుజన రైటర్స్ 7వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All

VEHICLE FOR SALE

★Maruthi Shift Dzire Model: Reg No. TS16ES0004 Cont